సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 2 । మే । 2025



చేపలున్నాయా? లేవా?
కులవృత్తినే నమ్ముకొని ఎస్సారెస్పీలో చేపల వేట కొనసాగిస్తున్న మత్స్యకారులకు చేపలు దొరకక ఉపాధి కోల్పోతున్నారు.
- 8లో ▸



కార్మికుల సంక్షేమానికి..
కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
44.8 /25.1

వాతావరణం
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణ పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక
సుభాష్‌నగర్ : నగరంలోని డీ–4 సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్)–2ను ఏర్పాటు చేసినట్లు డీఈ శ్రీనివాస్‌రావు, ఏడీఈ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. బోర్గాం(పీ), వినాయక్‌నగర్, నాగారం సెక్షన్లకు చెందిన వినియోగదారులు విద్యుత్ సమస్యలుంటే ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. ప్రధానంగా బిల్లింగ్, లైన్ల మరమ్మతులు, ఇతరత్రా విద్యుత్ సమస్యలపై సీజీఆర్ఎఫ్–2లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీజీఆర్ఎఫ్–2 చైర్మన్ ఎరుకల నారాయణ, కమిటీ సభ్యులు సలంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్, సీజీఆర్ఎఫ్ ఫోర్త్ మెంబర్ మర్రిపల్లి రాజాగౌడ్ పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

10 శాతం రాయితీ
- ఆర్టీసీ డీలక్స్ బస్సు ప్రయాణికులకు బంపర్ ఆఫర్


ఆర్ఎం జ్యోత్స్న

ఖలీల్‌వాడి : నిజామాబాద్ నుంచి వరంగల్‌కు డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారికి బేసిక్ టికెట్ చార్జీపై 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ డీలక్స్ బస్సులకు వర్తిస్తుందని, ప్రయాణికులకు ఉన్నత స్థాయి ప్రయాణాన్ని మరింత అందుబాటులో ఉంచడానికి ఆఫర్ ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ ఆఫర్‌ను ఉపయోగించుకొని టికెట్‌పై 10 శాతం తగ్గింపు చార్జీతో సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని ఆర్ఎం తెలిపారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా జడ్జి భరతలక్ష్మి



ఖలీల్‌వాడి: ప్రభుత్వం అమలు చేసే పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జీవీఎస్ భరతలక్ష్మి సూచించారు. మేడే సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని కార్మికుల దరికి చేర్చాలన్నారు. కార్మికుల కష్టానికి తగిన ప్రతిఫలం అందాలన్నారు. అదనపు జిల్లా జడ్జిలు ఆశాలత, హరీష మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్మిక ప్రయోజనాల కోసం కృషి చేస్తోందన్నారు. కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తామని, అవసరమైన సహకారం అందిస్తామని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ భాస్కర్ రావు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిల్ల సాయారెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రాజు, జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, సంస్థ పర్యవేక్షకురాలు శైలజారెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చే చలివేంద్రాలు
- నిబద్ధతతో నిర్వహణ
- ఏళ్ల తరబడి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న సంఘాలు

వినాయక్‌నగర్‌లో శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం


వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు ప్రస్తుతంతో పోలిస్తే గతంలో ఎక్కువగా ఉండేది. మారిన పరిస్థితుల నేపథ్యంలో రానురాను వీటి సంఖ్య తగ్గుతూ వస్తోంది. అయితే కొన్ని సంఘాలు, సంస్థలు మాత్రం నిజామాబాద్ నగరంలో ఏళ్లతరబడి క్రమం తప్పకుండా చలివేంద్రాలు నిర్వహిస్తూ వస్తున్నాయి. కొన్ని సంస్థలు 30 ఏళ్లుగా, మరికొన్ని సంఘాలు గత పదేళ్ల నుంచి వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. అయితే ఏదో ఏర్పాటు చేశామన్నట్లుగా కాకుండా వీటి నిర్వహణ, పరిశుభ్రత పాటించే విషయంలోనూ పక్కాగా వ్యవహరిస్తూ పూర్తి నిబద్ధత పాటిస్తున్నారు. నగరంలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ సేవాసమితి ఆధ్వర్యంలో గత పదేళ్లుగా నిర్వహిస్తున్న చలివేంద్రాలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారి దాహార్తిని తీరుస్తున్నాయి. వచ్చే ఏడాది చలివేంద్రాల సంఖ్య మరింతగా పెంచనున్నట్లు శివాజీ సేవాసమితి అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు తెలిపారు. అలాగే నగరంలో మార్వాడి యువమంచ్, రాజస్తానీ బ్రాహ్మణ సమాజ్, టీఎన్జీవోస్ తదితర సంఘాలు క్రమం తప్పకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తూ వస్తున్నాయి. సనాతన ధర్మ నిజామాబాద్ ఆధ్వర్యంలో నీళ్లతో పాటు మజ్జిగను సైతం అందిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం



బస్టాండ్‌లో నిజామాబాద్ మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం


గంజ్ వద్ద రాజస్తానీ బ్రాహ్మణ సమాజ్ యువమంచ్ ఆధ్వర్యంలో..

ప్రణాళికతో చదివా..

రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులు సాధించా..
- భవిష్యత్తులో మంచి డాక్టర్ నవుతా..
- పదో తరగతి స్టేట్ టాపర్ క్రితి



నిజామాబాద్ అర్బన్ : 'పదో తరగతి ప్రారంభంలోనే ఉత్తమ మార్కులు సాధించాలని నిర్ణయించుకున్నా. పాఠశాలలో టీచర్లు బోధించిన పాఠాలను ఎప్పటికప్పుడు చదివా. దీంతో అనుకున్న దానికంటే ఎక్కువ మార్కులు సాధించా' అని చెబుతోంది రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థిని క్రితి. కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో చదివిన ఆమె.. 596/600 రాష్ట్రస్థాయి మార్కులతో జిల్లా పేరును నిలబెట్టింది. ఆమె.. తన సక్సెస్ మంత్రాన్ని 'సాక్షి'తో పంచుకుంది.

తల్లిదండ్రుల స్ఫూర్తిగా..
భవిష్యత్తులో మంచి డాక్టర్‌ను కావాలన్నది నా కల. ప్రస్తుతం మా నాన్న డాక్టర్ కృష్ణ (ఈఎన్‌టీ), తల్లి సృజన డెంటల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. వీరి అడుగుజాడల్లోనే డాక్టర్ కావాలనుకున్నాను. వైద్యసేవలు అందించడం ఎంతో ఆనందాన్నిస్తుంది. అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదివి డాక్టర్‌నవుతా.

'రివిజన్ చేశా.. నోట్స్ రాసుకున్నా'
రోజూ పాఠశాలకు వెళ్లగానే ఆరు సబ్జెక్టులకు సంబంధించి టీచర్లు పాఠాలు బోధించేవారు. ఇంటికి వచ్చిన తర్వాత ఆయా సబ్జెక్టులను రివిజన్ చేస్తూ, ప్రతి అంశంపై నోట్స్ రూపొందించుకున్నాను. మరుసటి రోజు పాఠశాలలో నిర్వహించే పరీక్షలను సులభంగా రాసేదానిని. టీచర్లు బోధించిన అంశాన్ని పరిశీలన చేసుకోవడం, చదవడం అలవాటుగా మార్చుకున్నాను. దీంతో ప్రతి సబ్జెక్టుపై పట్టు పెరిగింది. కొన్నిసార్లు సమ్మెటివ్ పరీక్షల్లో అనుకోకుండా మార్కులు తగ్గేవి. అయినా ఒత్తిడికి లోనుకాకుండా రోజువారీ చదువును కొనసాగించాను. వార్షిక పరీక్షల్లో 590 మార్కులు సాధిస్తానని అనుకున్నా, కానీ 596 వచ్చాయి. అనుకున్న వాటికంటే ఎక్కువ మార్కులు రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

వెన్నుతట్టి ప్రోత్సహించారు


కుటుంబసభ్యులతో విద్యార్థిని క్రితి

నా చదువు విషయంలో తల్లిదండ్రుల సహకారం మరువలేనిది. ఎలా చదవాలి, ఒత్తిడి లేకుండా ఉండడం, సులభంగా అర్థమయ్యేలా పద్ధతులను వివరించారు. ప్రతి సబ్జెక్టుపై మొదట భయాన్ని తొలగించాలని తల్లిదండ్రులు చెప్పడంతో తేలికగా చదివాను. తక్కువ మార్కులు వచ్చినా వెన్నుతట్టి ప్రోత్సహించారు. శ్రద్ధ పెట్టి చదివితే మంచి మార్కులు సాధిస్తావని మోటివేట్ చేశారు.

మెరుగైన విద్యాబోధన



కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన అమలు చేస్తున్నాం. విద్యార్థుల మేథస్సుకు అనుగుణంగా చదివించాం. ఐఐటీ, నీట్, పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని పాఠశాల స్థాయిలోనే వారికి మెరుగైన విద్యను బోధిస్తున్నాం. ప్రత్యేక విద్యాబోధనతోనే క్రితి రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులు సాధించింది. మా పాఠశాల నుంచి 580 కి పైబడి మార్కులు సాధించినవారు 30 మంది ఉండడం ఎంతో గర్వకారణం.

– తేజస్విని, డైరెక్టర్, కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల

మహిళా సంఘాలకే స్కూల్ యూనిఫాంల బాధ్యత


భీమ్‌గల్‌లో మహిళా సంఘాల సభ్యులకు యూనిఫాం క్లాత్‌ను అందిస్తున్న సెర్ప్ సిబ్బంది (ఫైల్)

- ఒక్కో జతకు రూ.75 చొప్పున కూలి
- యూనిఫాం క్లాత్ అప్పగించిన అధికారులు
- జూన్ 1వ తేదీలోపు కుట్టించాలని నిర్ణయం

మోర్తాడ్(బాల్కొండ): పాఠశాలల పునఃప్రారంభంలోపు సర్కారు బడిలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలను అందించేందుకు అటు విద్యా శాఖ, ఇటు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ చర్యలు తీసుకుంటున్నాయి. మహిళా సంఘాలకు ఉపాధి కల్పించడంతోపాటు విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలను అందించేలా చకచకా ఏర్పాట్లు సాగుతున్నాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ల్లో 2024–25 విద్యా సంవత్సరం ముగిసే నాటికి ఉన్న విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకొని 47,016 మంది బాలురు, 54,442 మంది బాలికలకు రెండు జతల యూనిఫాంలను కుట్టించనున్నారు. విద్యాశాఖ ఇప్పటికే క్లాత్‌ను అప్పగించగా, సెర్ప్ ఉద్యోగులు మండలాల వారీగా టైలరింగ్ చేసే తమ సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. ఒక్కో జత యూనిఫాంను కుట్టేందుకు రూ.75 చొప్పున కూలి చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఒక్కో జతకు రూ.50 కూలి చెల్లించగా, కూలి గిట్టుబాటు కావడం లేదని మహిళా సంఘాల సభ్యులు సర్కారుకు విన్నవించారు. దీంతో ప్రభుత్వం స్పందించి రూ.25 చొప్పున కూలిని పెంచింది. గత సంవత్సరమే కూలి పెంచగా ఈ ఏడాది కూడా అంతే మొత్తం కూలి చెల్లించనున్నారు. కాగా, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా కూలి ధర పెంచితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సకాలంలో అందిస్తాం..
విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలను అందించేందుకు సలహాలు అందించాం. మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంతో యూనిఫాంలు కుట్టేందుకు ముందుకొచ్చారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా పాఠశాలల పునఃప్రారంభానికి ముందే యూనిఫాంలను అప్పగిస్తాం.

– సాయాగౌడ్, పీడీ, సెర్ప్

గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభ స్ఫూర్తిదాయకం


విద్యార్థులను అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభ స్ఫూర్తిదాయకమని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి పేర్కొన్నారు. తెయూ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో 8వ సెమిస్టర్ చదువుతున్న సింగని సాయివర్ధన్, కానుగుల విశ్వేశ్వరి సమ్మర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఇద్దరు విద్యార్థులను రిజిస్ట్రార్ ప్రత్యేకంగా అభినందించారు. సాయివర్ధన్ బెంగుళూరులోని ఇస్రో అనుసంధాన ఆస్ట్రోఫిజిక్స్ లేబొరేటరీలో అంతరిక్ష శాస్త్రంలో పరిశోధనకు ఎంపిక కావడం వర్సిటీకి గర్వకారణమన్నారు. విశ్వేశ్వరి హెచ్‌సీయూలో ప్రాసెస్ కెమిస్ట్రీలో పరిశోధనకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఫార్మాస్యూటికల్ విభాగ అధ్యాపకులను రిజిస్ట్రార్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాసం చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు
- ప్రతిరోజూ చెత్త సేకరణ చేపట్టాలి
- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు


ముదక్‌పల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్‌రావు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామాల్లోని నర్సరీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించొద్దని, ఎండవేడిమి దృష్ట్యా మొక్కలకు ప్రతిరోజూ నీరు పట్టాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శ్రీనివాస్‌రావు ఆదేశించారు. మోపాల్ మండలంలోని ముదక్‌పల్లి గ్రామపంచాయతీలో గురువారం ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణ తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శి సురేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని నర్సరీ, వైకుంఠ ధామాన్ని పరిశీలించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చూడాలని, ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తప్పుడు వివరాలు నమోదు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీవో కిరణ్‌కుమార్, కార్యదర్శులు సురేశ్, వెంకటేశ్, మృదుల, పద్మజ, కారోబార్ శ్రీనివాస్ ఉన్నారు.

రేవంత్ రెడ్డి అవుట్ సోర్సింగ్ సీఎం


మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శ

నిజామాబాద్‌అర్బన్: సీఎం రేవంత్ రెడ్డి అవుట్ సోర్సింగ్ ముఖ్యమంత్రి అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తి అని, తెలంగాణ బద్ధవ్యతిరేకి అయిన చంద్రబాబుకు శిష్యుడని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి తెలంగాణ అభివృద్ధిపై దృష్టి లేదని, తన కుటుంబం బాగుకోసమే పాటుపడుతున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను చూసి రేవంత్‌రెడ్డి మైండ్‌బ్లాక్ అయిందన్నారు. తెలంగాణ సాధించిన కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడం సరికాదన్నారు. టీడీపీని తెలంగాణలో సమాధి చేసిన నీవు కాంగ్రెస్‌ను కూడా సమాధి చేసే పనిలో ఉన్నావని పేర్కొన్నారు. దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడమంటే మళ్లీ తెలంగాణను ఆంధ్రాలో కలపడమేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్, రాంకిషన్ రావు, సత్య ప్రకాశ్, సుజిత్‌సింగ్ ఠాకూర్, పూజ నరేందర్, పోల సుధాకర్, సుంకరి రవి, రాజేశ్వర్ రెడ్డి, తెలంగాణ శంకర్, వెల్మల్ రాజన్న, మోహన్, రజనీష్, ఫయీం ఖురేషి, శేఖర్ రాజా, మహేశ్, నవీన్, సూర్య, సురేశ్ సన్నీ, రవి తదితరులు పాల్గొన్నారు.

జనగణన, కులగణన చారిత్రాత్మక నిర్ణయం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వం జనగణన, కులగణన చేపడతామని ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. కేంద్రమంత్రివర్గ నిర్ణయంపై హర్షం వ్యక్తంచేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తాలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనగణన, కులగణనతో దేశంలోని అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కేంద్రం నిర్ణయానికి ప్రజలు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తుంటే.. కాంగ్రెస్ మాత్రం ఈ విజయం తమదే అంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. 60 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ కులగణన ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే కులగణన, జనగణనలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉండే భారతీయులందరూ భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిడి స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, మాదాసు స్వామి యాదవ్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, నాగరాజు, గంగోనె సంతోష్, పంచరెడ్డి ప్రవళిక, పల్నాటి కార్తీక్, పుట్ట వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

రాహుల్‌గాంధీ సూచనతోనే కేంద్రం ప్రకటన


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్

- తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది
- దేశమంతా కులగణన అభినందనీయం
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: జనగణనతోపాటు కుల గణనను కూడా చేపడతామన్న కేంద్ర ప్రకటన అభినందనీయమని, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఆలోచనను కేంద్రం స్వీకరించిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. దేశమంతా కులగణన చేపట్టాలని రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో పలుమార్లు ప్రస్తావించారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో కులగణనను విజయవంతంగా చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. కులగణన అవసరమేలేదని మాట్లాడిన బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇప్పుడు ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకున్నారన్నారు. దేశమంతా కులగణన చేయడం కాంగ్రెస్ విజయమన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి, నాయకులు జావిద్ అక్రమ్, నరాల రత్నాకర్, కెతావత్ యాదగిరి, విపుల్ గౌడ్, నరేందర్ గౌడ్, సేవాదల్ సంతోష్, సాయి కిరణ్, శివ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎస్‌ను కలిసిన గడుగు



నిజామాబాద్‌ సిటీ: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్‌)గా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారావును రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలోని చాంబర్‌లో రామకృష్ణారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గడుగు వెంట భవానీరెడ్డి, మెంబర్‌ సెక్రటరీ గోవింద్‌ ఉన్నారు.

ఘనంగా అ'పూర్వ' సమ్మేళనం



మోపాల్‌: మండలంలోని ముదక్‌పల్లి జెడ్పీ పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంగ్యానాయక్‌, దయానంద్‌, లసీరాం, గోపాల్‌, శ్రీలత, సునీత, పద్మ, పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

చేపలున్నాయా? లేవా?

- ఎస్సారెస్పీలో జాలర్లకు చిక్కని మత్స్యసంపద
- కుల వృత్తిని నమ్ముకున్న మత్స్యకారులకు వేట సాగక ఇబ్బందులు

బాల్కొండ: అనాధిగా కుల వృత్తినే నమ్ముకుని ఎస్సారెస్పీలో చేపల వేట కొనసాగిస్తున్న మత్స్యకారులకు చేపలు దొరకక ఉపాధి కోల్పోతున్నారు. దీంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లో నిత్యం 5వేల కుటుంబాల మత్స్యకారులు చేపల వేటను సాగిస్తారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీరు తగ్గుముకం పట్టింది. దీంతో చేపల కోసం వేట సాగిస్తున్న మత్స్యకారులకు చేపలు దొరకక నిరాశే మిగులుతోంది.

ఈ ఏడాది 31లక్షల చేప పిల్లలు..

ఎస్సారెస్పీలో ప్రభుత్వం ఉచితంగా ఏటా 62 లక్షల చేప పిల్లలను వదులుతుంది. కానీ ప్రస్తుత సంవత్సరం 31 లక్షల చేప పిల్లలను మాత్రమే వదిలారు. వీటితోపాటు ప్రాజెక్ట్‌లో స్వయంగా చేపలు చేప పిల్లల ఉత్పత్తిని చేస్తాయి. అయినా చేపల వేట ప్రస్తుతం అంతంతా మాత్రంగానే ఉంది. దీంతో ప్రాజెక్ట్‌లో అసలు చేపలు ఉన్నాయా.. లేదా అంటూ మత్స్యకారులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 5 గంటలకే మత్స్యకారులు ప్రాజెక్ట్‌లో చేపల వేట కోసం వాలుతున్నారు. మధ్యాహ్నం వరకు ప్రాజెక్ట్‌లో తెప్పలపై సంచరిస్తూ వలలు వేస్తున్నారు. అయినా చేపలు చిక్కడం లేదంటున్నారు. పడితే శికారి లేదంటే బికారీ అన్నట్లుగా పరిస్థితి ఉందంటున్నారు. ఒక్కో రోజు ఖర్చులకు డబ్బులు రాని దుస్థితి ఉందంటున్నారు. వేట సాగకుంటే పూట గడవని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎస్సారెస్పీలో గతంలో అనేక నాసిరకం చేప పిల్లలను వదలడంతోనే చేపలు లేకుండా పోయాయనే విమర్శలు వినవస్తున్నాయి. నీరు తగ్గుముకం పట్టిన సందర్భంలో కూడ చేపలు చిక్కకుంటే నీరు నిండుగా ఉన్నప్పుడూ పరిస్థితి ఎంటాని జాలర్లు ఆందోళన చెందుతున్నారు. వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల సమయం, వరద కాలువ ద్వారా నీటి విడుదల సమయంలో ఎక్కువ మొత్తంలో చేపలు వెళ్లిపోతున్నాయంటున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి ఆదుకోవాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.



ఎస్సారెస్పీలో చేపలను వేటాడుతున్న మత్స్యకారులు

చేపలు చిక్కడం లేదు..



ప్రాజెక్ట్‌లో చేపలు చిక్కడం లేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, రాత్రిల్లో కూడ వేటాడుతున్నాం. కాని చేపలు రావడం లేదు. దీంతో ఖర్చులు కూడ మీదనే పడుతున్నాయి. చేపలు ఉన్నాయో లేదో తెలియడం లేదు.

– భాస్కర్‌, మత్స్యకారుడు, రెంజర్ల

కుల వృత్తినే నమ్ముకున్నాం..



తాతా ముత్తాతల నుంచి కుల వృత్తినే నమ్ముకుని బతుకుతున్నాం. చేపల వేట సాగక ఇంట్లో పూడ గడవడం లేదు. ప్రభుత్వం ఇతర పనులను కల్పించి మత్స్యకారులను ఆదుకోవాలి. ఎండ కాలంలో ఇలాంటి పరిస్థితి ఉంటే ఎట్లా బతుకుతాం.

– సాయిలు, మత్స్యకారుడు, బాల్కొండ

భారత్‌ సమ్మిట్‌ విజయంలో సుధాకర్‌ పాత్ర కీలకం



రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డితో సుధాకర్‌గౌడ్‌ (ఫైల్‌)



పీసీసీ చీఫ్‌తో సుధాకర్‌గౌడ్‌ (ఫైల్‌)

- విదేశీయులకు పెట్టుబడులపై వివరించిన యువకుడు
- సీఎం యూకే టూర్‌లో స్వయంగా పర్యవేక్షణ

నిజామాబాద్‌ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన భారత్‌ సమ్మిట్‌ విజయవంతంలో జిల్లాకు చెందిన యువకుడు ప్రధాన పాత్ర పోషించాడు. ప్రపంచ దేశాల్లోని పారిశ్రామిక వేత్తలు హాజరైన ఈ సమ్మిట్‌లో పెట్టుబడులే లక్ష్యంగా సెమినార్‌లు నిర్వహించారు. వీటిని జిల్లాకు చెందిన ఇండియన్‌ ఓవర్సీస్‌ కాంగ్రెస్‌ యూకె చాప్టర్‌ ఉపాధ్యక్షుడు రంగుల సుధాకర్‌ గౌడ్‌ కీలకంగా వ్యవహరించారు. ప్రపంచ వ్యాప్తంగా వంద దేశాలకు పైగా ప్రతినిధులు పాల్గొన్న ఈ సమ్మిట్‌లో కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్‌ బొమ్మ మహేశ్‌కుమార్‌ గౌడ్‌, మంత్రివర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సమ్మిట్‌లో ప్రపంచ స్థాయి నాయకులకు పవర్‌ప్లాంట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా సుధాకర్‌ గౌడ్‌ వివరించారు. దేశంలో ఇతర రాష్ట్రాల కంటే హైదరాబాద్‌ ఎంతో సురక్షితమని, తెలంగాణ పెట్టుబడుల ఖజానా అని వివరించారు. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధుల ప్రతిరోజు షెడ్యూల్‌తోపాటు పలు అంశాలను విదేశీయులకు వివరించారు. సుధాకర్‌గౌడ్‌ను రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలు ప్రశంసించారు. ఇటీవల సీఎం రేవంత్‌ రెడ్డి పర్యటించిన యూకే పర్యటన సైతం పర్యవేక్షించారు. సుధాకర్‌గౌడ్‌ సామర్థ్యాన్ని తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు భారత్‌ సమ్మిట్‌ నిర్వహణలో కీలక బాధ్యతలు అప్పగించారు. సమ్మిట్‌ విజయవంతం కావడంతో సుధాకర్‌గౌడ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌ అభినందించారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పంపిణీ చేసిన దుస్తులతో కార్మికులు

- రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- మే డే సందర్భంగా మార్కెట్‌ యార్డులో కార్మికులకు దుస్తుల పంపిణీ

సుభాష్‌నగర్‌: రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్మికుల కోసం మరిన్ని పథకాలు అమల్జేస్తామని నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ ఆర్‌ భూపతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మే డే సందర్భంగా నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లోగల మార్కెట్‌కమిటీ మీటింగ్‌ హాల్‌లో హమాలీ, దడువాయి, చాటా కార్మికులకు చైర్మన్‌ ముప్ప గంగారెడ్డితో కలిసి ఆయన దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. మే డే అంటేనే కార్మికులు తమ సమస్యలపై గొంతెత్తే దినమన్నారు. గంజ్‌లో పని చేసే కార్మికులందరికీ లైసెన్సులు, ఇన్సూరెన్స్‌ పథకాన్ని వర్తింపజేస్తామని తెలిపారు.

ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ ప్రారంభం..

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం పాలనలో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్‌ మార్కెట్‌ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను చైర్మన్‌ ముప్ప గంగారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు తక్కువ ధరకు నాణ్యమైన భోజనం, టిఫిన్లు, చాయ్‌ వంటివి అందించడానికి క్యాంటీన్‌ను ప్రారంభించామన్నారు. ఐడీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ తారాచంద్‌, డీసీసీబీ డైరెక్టర్‌ గోర్కంటి లింగన్న, మార్కెట్‌ డైరెక్టర్లు, మర్చంట్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కొరవడిన నాణ్యమైన విద్య

- ఇందుకు నిదర్శనమే 'పది' ఫలితాలు
- నార్త్‌, సౌత్‌ మండలాల్లో 154 మంది విద్యార్థులు ఫెయిల్‌

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన కొరవడింది. దీనికి నిదర్శనమే బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాలు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందాలన్నా, మంచి ఫలితాలు రావాలన్నా బోధన ఎంత ముఖ్యమో.. పర్యవేక్షణ కూడా అంతే ముఖ్యం. విద్యావ్యవస్థలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే 'పది' ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడ్డాయని చెప్పొచ్చు. జిల్లా కేంద్రంలో పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరిగిందని జిల్లా అధికారులు పేర్కొంటున్నా మెరుగైన ఫలితాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టిసారించకపోవడమే అతి తక్కువ ఉత్తీర్ణత నమోదైందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.



ఖలీల్‌వాడి ఉన్నత పాఠశాల

నార్త్‌, సౌత్‌ మండలాల్లో తక్కువ..

నార్త్‌ మండలంలో 248 మంది పరీక్ష రాయగా 215 మంది విద్యార్థులు పాసయ్యారు. ఇందులో అర్సపల్లి ప్రభుత్వ పాఠశాలలో 32 మందికి 25 మంది, కుమార్‌గల్లి పాఠశాలలో 19 మందికి 15 మంది, ఖలీల్‌వాడి పాఠశాలలో 79 మందికి 65 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. సౌత్‌ మండలంలో 361 మంది పరీక్ష రాయగా 240 మంది విద్యార్థులు పాసయ్యారు. కోటగల్లి శంకర్‌ భవన్‌ పాఠశాలలో 107 మందికి 61 మంది విద్యార్థులే పాసయ్యారు. వాటర్‌ ట్యాంక్‌ ఉన్నత పాఠశాలలో 21 మందికి 13 మంది, కసాబ్‌గల్లి పాఠశాలలో 135 మందికి 93 మంది, ఖిల్లా ప్రభుత్వ పాఠశాలలో 62 మందికి 45 మంది విద్యార్థులు పాసయ్యారు. జిల్లా వ్యాప్తంగా 766 మంది విద్యార్థులు ఫెయిల్‌ అయితే అందులో నార్త్‌, సౌత్‌ మండలంలో 154 మంది విద్యార్థులు ఉన్నారు. నార్త్‌, సౌత్‌ మండలాల్లో విద్యావ్యవస్థ గాడితప్పింది. ఇక్కడ జిల్లా కేంద్రం కావడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇక్కడే ఉన్నారు. వారు సంఘాల పేరిట ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు, సభ్యత్వాల నమోదు వంటి కార్యక్రమాలు చేపడుతూ పాఠశాలలకు డుమ్మాలు కొడుతున్నారు. గైర్హాజరును అరికట్టేందుకు ఉన్నతాధికారులు కూడా దృష్టిసారించకపోవడం విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. తరచూ విద్యార్థి సంఘాల తరగతుల బహిష్కరణ కూడా దీనికి కొందరు ఉపాధ్యాయ సంఘం నాయకులు వత్తాసు పలుకుతుండడంతో పాఠశాలల్లో నాణ్యమైన బోధన కొరవడుతోంది. సరైన విద్యాబోధన చేపట్టకపోవడంతోనే విద్యార్థులు చాలా మంది ఉత్తీర్ణులు కాలేదని పలువురు పేర్కొంటున్నారు.

పరిశీలన చేస్తాం

నార్త్‌, సౌత్‌ మండలాల్లో ఫలితాలు తక్కువ రావడంపై పరిశీలన చేస్తాం. మెరుగైన ఫలితాలు వచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఈ మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తాం. మెరుగైన ఫలితాల కోసం ప్రణాళిక రూపొందిస్తాం.

– అశోక్‌, డీఈవో

గుర్తు తెలియని మహిళ మృతదేహం గుర్తింపు



మోపాల్‌: మండలంలోని కాల్‌పోల్‌, పూర్వ వర్ని మండలంలోని తిమ్మాపూర్‌ అటవీ శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గురువారం రాత్రి గుర్తించారు. గుర్తు తెలియని మహిళ తునికాకు సేకరణకు వచ్చి దారితప్పిపోయి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. మూడు, నాలుగు రోజుల కిందటే మహిళ మృతిచెంది ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయమై స్థానికులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. కేసు విషయమై మోపాల్‌ ఎస్సై యాదగిరిని వివరణ కోరగా మహిళ మృతదేహంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని శుక్రవారం ఘటన స్థలాన్ని పరిశీలిస్తామని తెలిపారు. మృతదేహం మోపాల్‌ శివారు, పాత వర్ని శివారు ప్రాంతమ అనేది తెలియాల్సి ఉంది.

ఇసుక వేలంతో రూ.51వేల ఆదాయం



మోర్తాడ్‌: భీమ్‌గల్‌ మండలం బెజ్జోరా వాగు నుంచి ఇసుకను తవ్వి అక్రమంగా నిలువ చేయగా వాటిని ఇటీవల రెవెన్యూ అధికారులు సీజ్‌ చేశారు. గురువారం వాటికి వేలం నిర్వహించగా రూ.51వేల ఆదాయం లభించింది. బెజ్జోరా శివారులోని వాగు నుంచి తరలించి డంప్‌ చేసిన 25 ట్రాక్టర్ల ఇసుకకు తహసీల్దార్‌ మహమ్మద్‌ షబ్బీర్‌ వేలం నిర్వహించారు. ఏడుగురు వ్యాపారులు వేలంలో పాల్గొనగా బాబాపూర్‌కు చెందిన సమీర్‌ ఇసుక టెండర్‌ను దక్కించుకున్నాడు.

కేసులో వృద్ధురాలిని విచారించిన జడ్జి

ఖలీల్‌వాడి: అదనపు కట్నం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటు నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని నిజామాబాద్‌ రెండవ అదనపు జ్యుడీషియల్‌ మెజిస్ట్రేట్‌ శ్రీనివాస్‌రావు గురువారం కోర్టు ఆవరణలో ఉన్న ఆమె వద్దకు వచ్చి విచారించారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన ఓ మహిళ పలువురిపై వేధింపులు, అదనపు కట్నం పేరిట కోర్టులో కేసు వేశారు. విచారణలో భాగంగా నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు అనసూయను జడ్జి ఆమె వద్దకు వచ్చి విచ్చారించి వివరాలు తెలుసుకున్నారు.

క్రైం కార్నర్‌

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



ఇందల్వాయి: మండలంలోని లింగాపూర్‌ వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం పట్టుకొని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. పాటితండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే వాగులో తనిఖీలు చేపట్టి వారిని పట్టుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోపాల్‌లో..



మోపాల్‌: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బదావత్‌ మోహన్‌కు చెందిన ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో ట్రాక్టర్‌ను పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ ధ్వంసం.. ఆయిల్‌ చోరీ



నవీపేట: మండలంలోని నిజాంపూర్‌ ఎత్తిపోతల పథకానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు బుధవారం రాత్రి ధ్వంసం చేసినట్లు ఎస్సై వినయ్‌ గురువారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్‌ కాయిల్స్‌, ఆయిల్‌ను ఎత్తు కెళ్లారని పేర్కొన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మాక్లూర్‌: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మాక్లూర్‌ మండలం వెంకటాపూర్‌లో శివారులో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్‌ మండలం ఢీకంపల్లి గ్రామానికి చెందిన తంబాకు గౌరి(44), తంబాకు సాయిలు భార్యాభర్తలు. వీరు బోధన్‌ మండలం అమ్దాపూర్‌లో గురువారం నిర్వహించిన బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా వెంకటాపూర్‌ శివారులో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో గౌరి పై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె ఘటన స్థలిలోనే మృతి చెందింది. సాయిలుకు హెల్మెట్‌ ఉండడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గతంలోనే ఈ రోడ్డు గుండా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని 'సాక్షి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. అధికారుల్లో మాత్రం స్పందన కరువవుతోంది. ఈ రోడ్డు గుండా అనేక మూలమలుపులు ఉన్నాయి. కనీసం సూచిక బోర్డులు సైతం లేకపోవడంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పేకాట స్థావరంపై దాడి

సిరికొండ: మండలంలోని చిన్నవాల్గోట్‌ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ తెలిపారు. వారి నుంచి రూ. 5,250 నగదు, ఐదు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య



పూజిత (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: వేధింపులకు మరో నిండు ప్రాణం బలైంది. తరచూ భర్త వేధించడంతో ఓ వివాహిత భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం ఎన్టీఆర్‌ జిల్లా జగ్గయ్యపేట మండలానికి చెందిన పసుపులేటి సాయి అనే వ్యక్తికి అదే మండలానికి చెందిన పూజిత(20)తో తొమ్మిది నెలల క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా సాయి కామారెడ్డి సమీపం లోని ఎంఎస్‌ఎన్‌ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తూ తన భార్యతో కలిసి అశోక్‌ నగర్‌ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కొద్ది రోజులుగా సాయి మరో మహిళతో నిత్యం ఫోన్‌లో మాట్లాడుతున్నాడనే విషయంలో భార్యా భర్తల మధ్య గొడవ జరుగుతోంది. దీంతో పాటు పెళ్లి సమయంలో ఒప్పుకున్న అర ఎకరం భూమి రిజిస్ట్రేషన్‌ చేయించాలని సాయి తన భార్యతో తరచూ గొడవపడుతూ వేధింపులకు గురి చేసేవాడు. బుధవారం రాత్రి కూడా వారిద్దరి మధ్య గొడవ జరిగినట్లు కుటుంబీకులు తెలిపారు. దీంతో భర్త వేధింపులు తాళలేక మనస్థాపానికి గురైన పూజిత గురువారం ఉదయం వారు నివాసం ఉంటున్న రెండు అంతస్తుల భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. భర్త వేధింపులతోనే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి కృష్ణారావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

రుద్రూర్‌: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సునీల్‌ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోటగిరి పీఎస్‌ పరిధిలోని పొతంగల్‌ మండలం సోంపూర్‌ గ్రామానికి చెందిన సీతాపులే సంజీవ్‌(42) మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుమార్తె కాపురంలో కలహాలు రావడంతో..



గోపి (ఫైల్‌)

మోర్తాడ్‌: కుమార్తె కాపురంలో కలతలు రావడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మోర్తాడ్‌లో చేసుకుంది. ఎస్సై విక్రమ్‌ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మోర్తాడ్‌కు చెందిన కట్టికోల్ల గోపి(51) వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని కుమార్తె ప్రేమ వివాహం చేసుకోగా ఆమె కాపురంలో సమస్యలు తలెత్తాయి. దీంతో తండ్రి వద్ద ఉంటోంది. మరో వైపు కాలికి ఏర్పడిన గాయం మధుమేహం వ్యాధితో తగ్గకపోవడంతో జీవితంపై విరక్తితో గోపి బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో మరొకరు..



జాఫర్‌ మృతదేహం

ఆర్మూర్‌టౌన్‌: పెర్కిట్‌కు చెందిన సయ్యద్‌ జాఫర్‌(42) అనే వ్యక్తి జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జాఫర్‌ కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.


అనారోగ్యంతో మహిళ..

ఆర్మూర్‌టౌన్‌: ఆరోగ్య సమస్యలు భరించలేని ఓ మహిళ పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆర్మూర్‌ మండలం చేపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. చేపూర్‌కు చెందిన ముత్యాల సుష్మ(47) అనే మహిళ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతోంది. ఇటీవల ఆస్పత్రిలో చూయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించగా అర్ధ రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మహిళ దారుణ హత్య




హత్యకు గురైన కవిత

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని సరంపల్లి శివారులో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. ఘటనకు సంబంధించి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన చిదుర కవిత(40) అనే మహిళ బుధవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు.

దీంతో ఆమె భర్త గంగారెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి వెతికారు. అక్కడ ఓ చెట్టుకు చీరతో ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్‌ స్క్వాడ్‌, క్లూస్‌ టీం బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. కవిత ఒంటిపై పుస్తెలతాడు, బంగారు ఆభరణాలు, కాళ్ల కడియాలు లేకపోవడం, ఒంటిపై గాయాలు ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. దుండగులు ఆభరణాల కోసమే ఆమెను హత్య చేసి ఉరేసుకున్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త గంగారెడ్డి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



కామారెడ్డి అర్బన్‌: పిచ్చికుక్కదాడిలో ఐదేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దేవునిపల్లిలో ఉన్న ముత్యాలమ్మ ఆలయ సమీపంలో మాదుగుల స్వామి, రమ్య నివసిస్తున్నారు. వీరి కుమారుడు ప్రగ్నేశ్‌ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఎడమ కన్ను, చెవితో పాటు తొడలను తీవ్రంగా గాయపర్చింది. వెంటనే స్థానికులు ప్రగ్నేశ్‌ను కుక్క నుంచి కాపాడారు. కుటుంబీకులు చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు.